# కేంద్రం ఏర్పాటు చేయరు.. ధాన్యం కొనరు..

- సీజన్ దాటుతున్నా సర్దార్‌నగర్‌లో తెరుచుకోని వరి కొనుగోలు కేంద్రం
- తక్కువ ధరకే బయటి మార్కెట్‌లో అమ్ముకుంటున్న రైతులు
- రూ. 500 బోనస్ పేరుతో ప్రభుత్వం మోసం చేస్తుంది..
- ఆవేదన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై ఆదేశాలు రాలేదంటున్న అధికారులు



షాబాద్ మండల పరిధిలోని సర్దార్‌నగర్ మార్కెట్ యార్డులో తెరుచుకోని వరిధాన్యం కొనుగోలు కేంద్రం

షాబాద్, మే 15: అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మార్కెట్‌లో అమ్ముకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు పంటలకు నీరు అందక, మరో వైపు అకాల వర్షాలకు పంటలు దెబ్బతినడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇవన్నీ పక్కకు పెడితే చేతికొచ్చిన పంటను ఎక్కడ అమ్ముకోవాలో రైతులకు అర్థం కావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాతలు అయోమయంలో పడిపోయారు. చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాలకు సంబంధించి ప్రతి ఏడాది రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేవారు. శంకర్‌పల్లి మండలం మోకిలా, షాబాద్ మండలం సర్దార్‌నగర్‌లో కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద ధాన్యం సేకరించేవారు. గత వారం రోజుల క్రితం మోకిలాలో కేంద్రం ఏర్పాటు చేశారు. సర్దార్‌నగర్‌లో మాత్రం ఇప్పటివరకు కేంద్రం ఏర్పాటు చేయలేదు. ఇందుకు సంబంధించి తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని అధికారులు చెబుతున్నారు. సర్దార్‌నగర్‌లో ఏర్పాటు కేంద్రం ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల మండలాల రైతులకు ఎంతో మేలు జరిగేది. కాగా, రైతులు బయటి మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.1800 నుంచి రూ.2000 వరకు వడ్లను అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.2320 ఉండగా, బోనస్ రూ.500 కలిసి మొత్తం రూ.2820 వచ్చేదని, క్వింటాల్‌కు రూ.1000 వరకు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**13వేల ఎకరాల్లో వరిసాగు..**

చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాల్లో ఈ యాసంగి సీజన్‌లో 13వేల ఎకరాల్లో రైతులు వరిపంట సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మోకిలాలో ఒక్కచోట మాత్రమే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో మిగతా మూడు మండలాల రైతులు ధాన్యం విక్రయించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మీరు కూడా మోకిలాకు ధాన్యం తీసుకురమ్మని అధికారులు చెబుతున్నారని, ట్రాన్స్‌పోర్ట్ ఇబ్బందులు అవుతాయని అన్నదాతలు వాపోతున్నారు. సర్దార్‌నగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై ఇప్పటివరకు స్పష్టత లేకపోవడంతో రైతులు పండించిన వరిధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. క్వింటాల్‌కు రూ.1800 విక్రయించగా, ఖర్చుల కింద మరో రూ.100 తగ్గించి రైతుకు క్వింటాల్‌కు రూ.1700 మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో క్వింటాల్‌కు రూ.1000 నష్టపోతున్నామని రైతులు చెబుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం ఏంటని అన్నదాతలు ఆగ్రహానికి గురవుతున్నారు.

**ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి**



కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన సర్కార్ ఇప్పటివరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడం సరి కాదు. రెండు ఎకరాల పొలంలో వరిపంట సాగు చేశాను. పంటను అమ్ముకునేందుకు రైతులు అవస్థలు పడాల్సి వస్తుంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ అందించాలి.

- పెద్దగొల్ల మల్లయ్య, రైతు కుమ్మరిగూడ, షాబాద్

**క్వింటాల్‌కు రూ.వెయ్యి నష్టం..**



ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో రైతులకు క్వింటాల్‌కు రూ.వెయ్యి వరకు నష్టం వస్తుంది. నేను ఎనిమిది ఎకరాల పొలంలో వరిపంట సాగు చేశాను. ప్రస్తుతం పంట కోసేందుకు సిద్ధంగా ఉంది. ప్రభుత్వం ఇంకా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో వడ్లను ఎక్కడ అమ్ముకోవాలో తెలియక అయోమయంలో పడ్డాను. బయట మార్కెట్‌కు తీసుకువెళితే క్వింటాల్‌కు రూ.1800 వరకు ధర ఉంది. ప్రభుత్వం రూ.2320 ధరతో పాటు రూ.500 బోనస్ కలిపి రూ.2820 వస్తుందని అనుకున్నాం.

- కొత్తపల్లి వెంకట్‌రెడ్డి, రైతు కుమ్మరిగూడ, షాబాద్

**తక్కువ ధరకే వడ్లు కొంటున్నరు..**



నేను యాసంగి సీజన్‌లోఎకరన్నర పొలంలో వరిపంట సాగు చేశాను. ఓ వైపు అకాల వర్షాలతో పంట దెబ్బతింటుండంతో పాటు, ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో బయటి మార్కెట్‌కు తీసుకువెళ్లి వడ్లను విక్రయిస్తున్నా. అక్కడ తక్కువ ధరకే వడ్లు కొనుగోలు చేస్తున్నరు. ఏం చేయాలో అర్థంగాక దిక్కుతోచని స్థితిలో వడ్లను విక్రయించా. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాతలకు తిప్పలు తప్పడం లేదు.

- మ్యాథస్‌రెడ్డి, రైతు మరియాపురం, షాబాద్



పాఠశాలలో తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న చిన్నారులు

## తల్లిదండ్రులకు పాదపూజ

ఆమనగల్లు, మే 15 : తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవం లాంటివారని వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి మాధవరెడ్డి, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ వ్యవస్థాపకుడు లీలాలక్ష్మారెడ్డి అన్నారు. ఆమనగల్లు మండల కేంద్రంలో సాయిరాం మెడికల్, వందేమాతరం ఫౌండేషన్, శృతిలయ కల్చరల్ అకాడమీ, మై విలేజ్ మాడల్ విలేజ్ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి సంగీత ఉచిత శిక్షణలో శిబిరంలో భాగంగా గురువారం వివేకా విద్యాభారతి పాఠశాలలో తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. కార్యక్రమంలో మెడికల్ షాప్ అసోసియేషన్ నాయకులు పాపిశెట్టి రాము, శృతిలయ కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకుడు చిత్తరంజన్ దాసు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్, శ్రీనివాసులు, ఆచార్య రమేశ్‌గురూజీ, ఉమాపతి గురూజీ, వలంటీర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



నందిగామ, మే 15 : నందిగామ మండల పరిధిలోని జంగోనిగూడ గ్రామంలో గత కొన్ని నెలలుగా వ్యవసాయ పొలాలకు వెళ్లే వివిధ స్తంభాలు నేలకొరగడంతోపాటు విద్యుత్ తీగలు రైతులకు అందే స్థాయిలో కిందకు ఒరిగి ప్రమాదకంగా మారాయి. విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, అటుగా వెళ్లిన మనుషులు, పశువులు విద్యుత్ వైర్లను గమనించక ప్రమాదం బారిన పడే అవకాశాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దుతా

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



షాద్‌నగర్‌టౌన్, మే 15: ప్రతి వార్డులోనూ అభివృద్ధి పనులను చేపట్టి మరింత సుందరంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీలోని 10వ వార్డులో అంతర్గత మురుగుకాలువ నిర్మాణ పనులకు గురువారం మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి, మాజీ చైర్మన్ విశ్వం, మాజీ కౌన్సిలర్ శ్రావణితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదర్శ మున్సిపాలిటే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు చెన్నయ్య, శ్రీకాంత్‌రెడ్డి, బస్వం, తిరుపతిరెడ్డి, రఘు, ఇబ్రహీం, జమృత్‌ఖాన్, నాగమణి, రమాదేవి పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం



కడ్తాల్, మే 15: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.10 లక్షలతో చేపట్టిన, మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులను పీసీబీ మెంబర్ బాలాజీ సింగ్, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులు, చెంచుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించిందన్నారు. యువతను ఆదుకోవడానికి రూ.6వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్, ఏఎంసీ డైరెక్టర్లు వెంకటేశ్, నరేశ్‌నాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, నాయకులు చందోజీ, జవహర్‌నాయక్, హీరాసింగ్, తులసీరాంనాయక్, సుమన్, కిషన్, శివ పాల్గొన్నారు.



మండల పరిధిలోని ఆరుట్ల గ్రామ అయ్యప్ప డ్రైవర్ అసోసియేషన్ సభ్యుడైన ఆర్ల సత్తయ్య ఇటీవల మృతి చెందాడు. కాగా, గురువారం డ్రైవర్ అసోసియేషన్ సభ్యులు రూ.30వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

- మంచాల, మే 15

# పంట మార్పిడిని పాటించాలి

మొయినాబాద్, మే 15 : వరి సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు రావడానికి అవకాశం ఉంటుందని పీజేటీఎస్‌ఏయూ శాస్త్రవేత్త డాక్టర్ మహాదేవప్ప, డాక్టర్ రమేశ్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖలు సంయుక్తంగా చేపట్టిన రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని చిలుకూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను స్వీకరించి యాజమాన్య పద్ధతులను పాటించాలని చెప్పారు. తక్కువ రసాయనాలను వినియోగించి అధిక దిగుబడులను సాధించి నేల సారవంతాన్ని, ఆరోగ్యాన్ని మెరుగుపరిచే విధానాన్ని అవలంబించాలని సూచించారు. పంటకు ముందు పచ్చి రొట్టను సాగు చేసి కలియదున్నితే నేలలో సారవంతం పెరుగుతుందని, పంట దిగుబడులు కూడా వస్తుందన్నారు. భూమిలో ఒకే రకమైన పంటను సాగు చేయకుండా పంట మార్పిడిని పాటించాలని సూచించారు. మార్కెట్‌లో విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదును పొందాలన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసుకుంటే రైతులు ఆదాయం పొందడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఏడీఏ బీజే సురేశ్‌బాబు, మండల వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, ఉద్యానవన శాఖ అధికారి కీర్తికృష్ణ, ఏఈవో సునీల్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌లోని చిలుకూరు గ్రామంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

**సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు**

ఆమనగల్లు : రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ఉపయోగించి అధిక దిగుబడులు పొందవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్తలు నిర్మల, సుజాత తెలిపారు. గురువారం ఆమనగల్లు మండల పరిధిలోని కోనాపూర్‌లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. మార్కెట్‌కు అనుగుణంగా పంటలు పండించాలని, రసాయనాలు, క్రిమిసంహారకాలు ఎక్కువ వాడవద్దని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ శోభారాణి, మండల వ్యవసాయ అధికారిణి అరుణకుమారి, విస్తరణ అధికారి మీనాక్షి, స్వప్నశ్రీ, తరుణ్ పాల్గొన్నారు.

**శాస్త్రవేత్తలు రైతులకు సూచనలు**

మాడ్గుల : మండల పరిధిలోని నాగిళ్ల గ్రామంలో రైతు వేదిక భవనంలో గురువారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ మురళి, డాక్టర్ ప్రవీణ్ హాజరై, శాస్త్రవేత్తలు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయాలని సూచనలు ఇచ్చారు. పంటల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై వివరించారు. కార్యక్రమంలోని వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి రాజేశ్‌నాయక్, ప్రియాంక, భార్గవి, జ్యోత్స్న పాల్గొన్నారు.



ఆమనగల్లు : కోనాపూర్‌లో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు



మాడ్గుల: రైతులకు పంటలపై సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

## పశువైద్య ఉప కేంద్రాలకు పారామెట్ల నియామకం



పశువైద్య ఉప కేంద్రంలో విధుల్లో చేరిన లైవ్ స్టాక్ అసిస్టెంట్ స్వప్నతో గ్రామస్తులు

కేశంపేట, మే 15 : మండల పరిధిలోని పశు వైద్య ఉప కేంద్రాలకు ప్రభుత్వం పారామెట్లను నియమించినట్లు కేశంపేట పశువైద్యాధికారిణి నివేదిత తెలిపారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో లైవ్ స్టాక్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరిన స్వప్నకు గురువారం బాధ్యతలు అప్పగించి మాట్లాడారు. మండలంలోని కొండారెడ్డిపల్లి, పాపిరెడ్డిగూడ, ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామాల్లో పశువైద్య ఉప కేంద్రాలు ఉన్నాయని, అయితే అక్కడ పారామెట్లు లేక రైతులకు కొంతమేర ఇబ్బందులు తలెత్తాయన్నారు. ఈ విషయమై ప్రభుత్వం స్పందించి ఆయా గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఉప కేంద్రాలకు పారామెట్లను నియమించడం జరిగిందన్నారు. పాడి పరిశ్రమ ప్రగతికోసం రైతులకు కావాల్సిన సూచనలు అందజేయాలని పారామెట్లకు సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివయ్య, నాయకులు శ్రావణ్‌రెడ్డి, సుందరయ్య, రాణి, రవీందర్, ఆంజనేయులు, సత్యంగౌడ్, రామస్వామి, రాంచందర్, భిక్షపతి, కృష్ణయ్య, శ్రీను, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలి



మంచాల, మే 15: విద్యార్థులు, పిల్లలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని మాస్టర్ గౌరవ శర్మ అన్నారు. గురువారం మంచాల మండల పరిధిలోని జాపాల పాఠశాల ఆవరణలో స్ట్రీట్ కాజ్-జీఎస్ఐ ఆధ్వర్యంలో చిన్నారులకు సెల్ఫ్- డిఫెన్స్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితిలో తమను తాము ఎలా రక్షించుకోవాలనే అంశాలను పిల్లలకు నేర్పించాలని సూచించారు. పిల్లలకు వ్యక్తిగత భద్రతతో పాటు అవసరమైన పరిజ్ఞానం నైపుణ్యాలు అందించాలని పేర్కొన్నారు. సెల్ఫ్-డిఫెన్స్‌తో పిల్లల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో యోగా గురువు సింగారం భాస్కర్, విద్యార్థులు ఉన్నారు.

## బలిజగూడ గుడిలో చోరీ

పెద్దఅంబర్‌పేట, మే 15: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బలిజగూడలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో చోరీ జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గురువారం తెల్లవారుజామున గుడికి వెళ్లిన భక్తుడు.. తాళాలు పగలగొట్టడాన్ని గుర్తించి, గ్రామ పెద్దలకు సమాచారం ఇచ్చాడు. తులం బంగారు పుస్తెల తాడు, కిలో వెండి శివుడి నాగాభరణం, అరకిలో వెండి పల్లెం, వీరభద్రుడి ఖడ్గం, మీసం, తీర్థప్రసాదం తదితర వెండి వస్తువులు చోరీకి గురైనట్టు గుర్తించారు. చోరీ జరిగిన ఆలయాన్ని వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అశోక్‌రెడ్డి పరిశీలించారు.

## నేడు క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

మాడ్గుల, మే15: మండల పరిధిలోని నల్లచెరువు గ్రామంలో శుక్రవారం వేసవి సందర్భంగా కీర్తిశేషులు రెడ్డి నర్సింహారెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్నట్లు నర్సింహారెడ్డి కుమారులు రెడ్డి పెద్దారెడ్డి, రెడ్డి తిరుపతిరెడ్డి బీఆర్ఎస్ నాయకులు, గ్రామ మాజీ సర్పంచ్ రెడ్డి మాలతీకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతి రూ. 10,016, ద్వితీయ బహుమతి రూ. 7,016 గెలుపొందిన జట్లుకు అందజేస్తామని తెలిపారు.

## ఇంటి నిర్మాణానికి చేయూత



కడ్తాల్, మే 15: తలకొండపల్లి మండల పరిధిలోని మాదాయిపల్లి గ్రామానికి చెందిన శీలం చందు ఇంటి నిర్మాణానికి మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ తరపున ఇంటి నిర్మాణానికి సిమెంట్, సీకులు అందజేశారు. కార్యక్రమంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సుధాకర్, శేఖర్, దశరథం, మల్లేశ్, శ్రీశైలం, కృష్ణ పాల్గొన్నారు.

## అకాల వర్షం.. విద్యుత్‌కు అంతరాయం



మొయినాబాద్, మే15: మండల పరిధిలోని జేబీఐటీ సమీపంలో అమ్డాపూర్ రోడ్డుకు ఉన్న 11కేవీ విద్యుత్ స్తంభాలపై ఈదురు గాలులతో కూడిన వర్షాలకు వృక్షాలు విరిగి పడ్డాయి. దీంతో బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి గురువారం సాయంత్రం 5:30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

**రిజిస్ట్రేషన్‌ల కోసం పడిగాపులు**

రెవెన్యూ కార్యాలయానికి పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రిజిస్ట్రేషన్‌ల కోసం ఉదయం 11 గంటలకు వచ్చిన జనం సాయంత్రం 5:30 గంటల వరకు పడిగాపులు కాశారు. కార్యాలయంలో ఉన్న పవర్ స్టోరేజీ బ్యాటరీలు డెడ్ అయ్యాయి. దీంతో రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ సేవలు చేయడానికి ఇబ్బందులు పడ్డారు. వెంటనే కొత్త బ్యాటరీలను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ గౌతంకుమార్ సిబ్బందిని ఆదేశించారు. ఏఈ హము సిబ్బందితో కలిసి సాయంత్రం 5:30 గంటల తరువాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అనంతరం సాయంత్రం 7 గంటల వరకు అధికారులు రిజిస్ట్రేషన్లు చేశారు.

**ప్రభుత్వ కార్యాలయాల్లో ఆగిన సేవలు**



మొయినాబాద్ రెవెన్యూ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో పడిగాపులు పడుతున్న జనం

# సమ్మెను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర నాయకుడు భూపాల్

యాచారం, మే15: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న దేశ వ్యాప్తంగా చేపడుతున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపునిచ్చారు. మండలంలోని గున్‌గల్ క్రీడా క్షేత్రంలో గురువారం సీఐటీయూ జనరల్‌బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేందుకు ఈనెల 20న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను చేపట్టనున్నట్లు తెలిపారు. దీనికి కార్మిక, కర్షకులందరూ సహకరించి విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బ్రహ్మయ్య, చందునాయక్, రాములు, శివుడు, రాణి, యశోద, విజయ, శ్రీకాంత్ పాల్గొన్నారు.



కొందుర్గులో సమ్మె వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నేతలు

**వాల్ పోస్టర్ విడుదల**

కొందుర్గు : దేశవ్యాప్తంగా ఈ నెల 20న నిర్వహించతలపెట్టిన సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్‌ను గురువారం సీఐటీయూ మండల కన్వీనర్ రాయికంటి గోపాల్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఈ నెల 20న సార్వత్రిక సమ్మెను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మంజుల, అమృతమ్మ, రామచంద్రయ్య, జయమ్మ, రత్నమ్మ, రత్నయ్య, సత్తమ్మ, భాగ్యమ్మ పాల్గొన్నారు.